
ఆలోచించుకోడానికి కూడా అవకాశం ఇవ్వకుండా మహావేగంతో తనని ఇక్కడి దాకా తీసుకువచ్చి, ఈ విద్రగన్నేరు చెట్టునీడలో వదిలేసి, ఇంక నీతో నాకు పనేమిటి అన్నట్లు వెనకగా నీడలో నిలబడిపోయిన తన నెత్తిన ఇంత దుమ్ము పోస్తూ శరవేగంతో ముందుకు దూసుకుపోతున్న బసు వేపు కొంచెంసేపు శూన్యంగా చూసి నిట్టూర్చింది సౌదామిని.

అటుచూస్తే పల్లెకుచేర్చే పాము మెలికల కాలిబాట - ఆ బాట వచ్చి పెద్ద తారురోడ్డుకి పాణిగ్రహణం చేసే మొగలో దుమ్ము కొట్టుకుపోయిన ఈ విద్రగన్నేరు చెట్టు - ఈ చెట్టు ఆకుల సందులలోంచి శరీరం అంతా మచ్చలు పడ్డవాడిలా కనిపించే ఆ అస్తంగత సూర్యుడు!

సరిగ్గా అయిదేళ్ళ క్రితం!

ఇదే బాట దగ్గర ఈ చెట్టుకిందే ఇలాంటి సంధ్యాసమయంలోనే - ఉత్సాహం ఉరకలు వేస్తూంటే, శరీరం యౌవ్వనపు పొంగుతోనూ, మనస్సు మధురోహలతోనూ నిండి దాదాపు తనవితాను మరిచిపోయినస్థితిలో, శేషూ కళ్ళు పక్కనుండి తనకి పిచ్చెక్కిస్తూంటే, అప్పటిదాకా తనకి సర్వస్వంగా ఉంటూ వచ్చిన పల్లె



# కొత్త చిగుళ్ళూ - మంచు బిందువులూ

పి. రాజ్యలక్ష్మి

వేపు వీపుతిప్పి అడుగు కదిపింది తను లోకం లోకి. ఎండమావులులా అందంగా కనిపిస్తున్న భవిష్యత్తులోకి!

అదే బాట!

ఆ చెట్టే!

మళ్ళా సరిగ్గా ఆ సంధ్యాసమయమే!

తిరిగి నాటికీ నేడు - నాటికీ నేటికీ మూడింటిలోనూ మార్పు ఏం లేదు. ఉన్నమార్పంతా తనలోనే. ఆనాడు "పల్లె" కాదనిపోయి, ఇపుడు ఆ పల్లే కావాలని వస్తున్న తనలోనే... తనలోనే ఈ మార్పంతా. ఉషఃకాంతుల తాకిడి కూడా ఇంకా తగలని లేత గులాబీ మొగ్గ తను అప్పుడు. భయంకరమైన జీవితానుభవం వేడి తగిలి ఎండిపోయి ఆనందపురేకులన్నీ రాలిపోయి ముళ్ళతొడిమ మాత్రంగా మిగిలిపోయిన తన ఇప్పటి స్థితికీ అప్పటి స్థితికీ పోలికా!... ఒత్తైన తలకట్టూ, మెత్తని చెక్కిళ్ళూ, ధరించిన దుస్తుల్లో బిగువుగా అమిరిన శరీరం - ఇది అప్పటి రూపం. పాయలుపాయలుగా విడిపోయిన జుట్టూ పాలిపోయిన బుగలూ కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని కట్టెగా మారిన రూపం ఇప్పటిది.

ఆ రోజున తనచుట్టూ వికసించిన పుష్పాలే! గండుకోయిలల వగరుగొంతులే! చల్లగా హాయిగా తగిలే మలయానిలాలే!... ఇవాళ తన ఊహల చుట్టూ నిలచినవి ఆకులు రాలి మోడులుగా మారిన చెట్లూ, ఆత్మీయుల అవహేళనలూ, ప్రాణాల్ని గడ్డకట్టించే మంచుబిందువులూను.

ఎంతమార్పు! అయిదేళ్ళలో ఎంత మార్పు వచ్చింది తనలో!... పాతరోజులతో ఈ రోజుల్ని పోల్చుకుని గట్టిగా తనివితీరా ఏడవాలనిపించింది సౌదామినికి.

మరే!

అంత అదృష్టం కూడానా తనకి! గుండెల్లో బరువు తీరేలాగ ఏడ్చి మనస్సుని హాయిగా తేలిగ్గా చేసుకోవడం ఎంత అదృష్టవంతులకి!... తనకి ఏడుపు కూడా రాదు, అధమం కళ్ళు అయినా తడి కావు. ఎంత బాధవచ్చినా దాన్ని మంటలా గుండెలో రగుల్చుకో వలసిందే! ఈ అయిదేళ్ళలోనూ శేషు వల్ల ఎన్ని అనుభవాలు కలిగి బావుమని ఏడవాలనిపించలేదు తనకి!... కాని ఒక్క

మాటు... ఒక్క మాటంటే ఒక్కమాటు ఏడవ గలిగిందా తను?

ఉహూఁ... ఏడవలేదు... అసలు తనకది చేతకాదు. ఏం చేస్తుంది? తను పుట్టి పెరిగిన వాతావరణం అటువంటిది. పదహారేళ్ళు వచ్చే దాకా తన అందమైన అంకసీమలో ముగ్ధలా ఉయ్యాల లూగించిన ఈ పల్లె, స్వర్గాన్ని మరిపించే ఇల్లూ, ప్రేమకి ప్రతిరూపమైన అమ్మా, ఆప్యాయతా అభిమానం ఆకారం దాల్చిన అన్నయ్యా, అన్నిటికంటే అధికంగా దైవత్వాన్ని పుణికిపుచ్చుకున్న సూరయ్య మావగారి రామూ. ఈ వాతావరణంలో పెరిగిన తనకి ఏడుపు అంటే ఏమిటో తెలుసుకొనే అవకాశం ఏదీ...

ఆ రోజున ఇవన్నీ కాలదన్నుకొని, "శేషు అకర్షవంతమైన కళల్లో ఏవో కొత్త స్వర్గాలున్నాయని భ్రమించి వెళ్ళి, అయిదేళ్ళయాక మళ్ళీ పూర్వపు ఆనందాన్ని వెతుక్కుంటూ వస్తోంది.

ఇంకా తనకై ఆ ఆనందాలు మిగిలాయా?

సౌదామినికి బాధవల్ల గొంతు అంతా నొప్పిగా పున్నట్లు తోచింది. హృదయంలో మంట మనస్సులో పెద్ద వెలితి. ఏదో భయం... అలా భయం భయంగానే ఒణుకుతూన్న కాళ్ళతో వేవంకర బాట ఎక్కింది... నెమ్మదిగా బరువుగా బాట పల్లెవేపు సాగింది.

సాగిసాగి ఏటికి ఇవతల ఒడ్డున ఆగిపోయింది ఆ బాట. వర్షాకాలం అయితే దోనె మీద ఏరుదాటి అవతల గట్టు ఎక్కితే కాని పల్లె కనిపించదు. శిశిర ఋతువైనా గ్రీష్మంలోలాగ ఏటిలో నీళ్ళులేవు తన కళ్ళల్లోలాగే. అందుకే దోనె అవసరం లేకపోయింది సౌదామినికి.

ఒక్కమాటు ఆగి నాలుగువైపులా చూసింది. ఎండిన ఏటి మధ్య తను.

ఇటు ప్రకృతి సౌందర్యానికి నీరాజనం ఇస్తూన్న ఎర్రని సూర్యుడూ గూళ్ళకి పోతూన్న పక్షుల మంగళహారతి పాటలూను.

అటు ఏటి అవతల "ఎంత ఘోర పాపాత్ములనయినా క్షమిస్తాను రండి" అని చెయ్యెత్తి పిలుస్తూనట్లు ఒడ్డునుంచి కొద్దిగా కనిపిస్తూన్న దేవాలయ శిఖరం.

సౌదామినికి శరీరం ఒక్కమాటు ఝల్లుమంది.

ఇదంతా తను పది పదిహేనేళ్ళు వచ్చేదాకా ఆడిపాడిన చోటు. ఈ ఏటిలోని ప్రతి ఇసుక రేణువూ ఆ దేవాలయంలోని ప్రతి అంగుళమూ తనకి చిరపరిచితమైనవే. ప్రతిసాయంత్రం తనూ రామూ ఈ దేవాలయంలోనే పరుగులిడుతూ ఆడుకొనేవారు... రామూ.

తను దొంగఆయి తరుముతూంటే దొరక్కుండా ఎన్నిమార్లు దేవాలయ శిఖరం ఎక్కి రామూ తనని ఏడిపించలేదు? అటలోలాగే జీవితంలో కూడా రామూ శిఖరంమీదే ఉన్నాడు. తనకి అందేస్థితిలో లేడు. అసలు తను అందుకోడానికి ప్రయత్నించిందా అతణ్ణి?.........

ప్రయత్నిస్తే శిఖరం ఎక్కి అతణ్ణి అందుకునేదేమో.. లేదా ఐతిమాలినా చాలు... అతను దిగి వచ్చేవాడు. తను రెండూ చెయ్యలేదు. ఆలా చెయ్యకపోవడానికి అప్పట్లో తనకి కోపం, పౌరుషం అడ్డు వచ్చాయి.

అందుకే తాని రోజున ఇంత క్రిందగా ఎండిపోయిన ఏటిమధ్య.

అతను అంత ఎత్తుగా దేవాలయశిఖరంమీద.

అతి ప్రయాసమీద అవతలి ఒడ్డు ఎక్కిన సౌదామినికి ఎదురుగా నిలుచున్న దేవాలయం, దాని నీడలో విశాలంగా పరుచుకున్న పల్లె కనిపించాయి. అప్రయత్నంగా ఒక్క అడుగు వెనక్కి వేసింది సౌదామిని. భయంతో తడబడాయిస్తూన్న సౌదామినికి ఎదురుగా దేవాలయ శిఖరంమీద మసక వెలుతురులో ఏదో నీడ కన్పించింది. నీడ మనిషిగా, మనిషి, మోకాళ్ళ మీద గెడ్డంఆన్చి ఆలోచిస్తూ కూర్చొనిగా, ఆమౌన రామూ ఆకారంగా మారినట్లు అనిపించింది సౌదామినికి.

రక్తప్రసరణ స్తంభించింది... ఉన్నట్టుండి శరీరంలోని ప్రతి అణువులోనూ మహావేగంతో కొట్టుకుంటూన్న గుండె చప్పుడు వినిపించింది.

రామూ తలెత్తి ఇటు చూస్తే... చూసి తనని పలకరిస్తే.

"హమ్మో!"

తను ఏ మొగం పెట్టుకుని సమాధానం ఇస్తుంది? అసలు ఏం ఇస్తుంది... రామూకే కాదు తను ఎవరికీ ఇవ్వలేదు సమాధానం. "ఆ రోజున అలాచెప్పకుండా ఈ స్వర్గాన్నివదిలి ఎక్కడికి వెళ్ళిపోయావు? ఈ అయిదేళ్ళు ఎక్కడ ఉన్నావు? ఇప్పుడు ఎందుకు తిరిగి వచ్చావు?" అని తనక ప్రశ్నిస్తే.


అవును. అమ్మ ఇలా అడిగితే, లేదా అన్నయ్య నిలదీసి ప్రశ్నిస్తే తను ఏం సమాధానం చెప్పేను?... ఒక్క క్షణం వెనక్కి వెళ్ళిపోదాం అనిపించింది సౌదామినికి... కాని వెళ్ళిపోడానికా తను ఇంతదూరం వచ్చింది?...

అన్నింటికీ సిద్ధపడే వచ్చిన తనకి, సమాధానం ఏం చెప్పాలా అనే సంకోచం ఎందుకు? వాళ్ళ కాళ్ళ మీదపడి "పొంగులువారే వయస్సులో కుడి ఎడమలు తెలియక పొరబాటు చేశాను. క్షమించండి" అని అడుగుతుంది... దేవతామూర్తుల లాంటి అమ్మా అన్నయ్యల సాన్నిధ్యంలో, పవిత్ర దేవాలయంలాంటి ఆ ఇంట్లో పశ్చాత్తాపంతో కుమిలిపోయినా తనపాపం కొంత క్షాళితం అవుతుంది...

బరువుగా, భయంగా తడబడుతూ కాలు తీసి కాలు వేస్తూ వీధి మొగలోకి వచ్చిన సౌదామినికి, అరుగుమీద చుట్ట కాల్చుకుంటూ సూరయ్య కనిపించాడు మావ. అనుకున్నంతా అయింది. "ఆగవే భడవా, ఇన్నాళ్ళూ ఎక్కడికి వెళ్ళావు?..." అంటూ ఒక్క ఉరుము ఉరిమితే... గబగబా నడిచింది సౌదామిని. సూరయ్య మావ అసలు పలకరించేలేదు. తనని పలకరించడానికి అసహ్యం వేసిందేమో.

ఒక్క అంగలో ఇల్లు చేరుకొని "అమ్మా!" అని పిలుద్దాం అని తెరిచిన నోరు ఆ మట్టునే ఉండిపోయింది. నిత్యమూ కలకల్లాడుతూ కలువల తోరణాలతో నవ్వుతూ ఉండే గుమ్మం తాళం వేసి ఉంది. ఇవతల గేటుకికూడా తాళం ఉంది.. అమ్మా అన్నయ్యా ఎక్కడికి వెళ్ళారు?... ఎవర్ని అడగడం?...... పైట చెంగు నోట్లో కుక్కుకుని "ఈ ఇంటికి పరాయిదానిలా గేటు ఇవతల ఉండిపోవలసివచ్చిందే" అంటూ మౌనంగా బాధపడసాగింది సౌదామిని, గేటుమీద తల ఆన్చి అలా ఎంతసేపు ఉండిపోయిందో......

ఇంతలో చేతి లాంతరు పట్టుకొని అటే వెళుతూన్న "వెంకి" ఆగి దగ్గరగా వచ్చి పరకాయించి సౌదామినిని చూసి "అయ్యో నాతల్లీ... ఇప్పుడా వచ్చావా?... నీకోసం ఏడాదిపాటు ఏడిచి ఏడిచి ఆ మహాతల్లి ఎల్లిపోయాక. మూసి మూసి అన్నయ్యా దేశాలు పట్టుకుపోయాక ఇప్పుడొచ్చి ఏం లాభం నాతల్లి!...ఇదిగో......



# కొత్త చిగుళ్ళూ-
# మంచు బిందువులూ

చెల్లాయి వస్తే కాళంచెవులు ఇమ్మని ఎల్లిపోయాడు ఎక్కడికో ఆ మారాజు. ఎప్పుడూ అయి ఇలా పెంగులి కట్టుకు తిరుగుతున్నా" అంటూ కాళాలు తీయసాగింది వెంకి...


పిడుగు పడ్డట్టు ఆ మాటలు విని భ్రమపడి ఉండిపోయింది సౌదామిని... గుండె ఆగి మెదడు స్తంభించినట్లు అయింది... అమ్మ... అమ్మ తనకింక లేదూ?...క పులించి ఏదో జ్వాల...మంటల్లో నిలబడినట్లు మహా ఆవేదన!

"నిలబడి పోయావేం తల్లీ... లోపలికిరా" అన్న వెంకి కేకకి, ఉలిక్కిపడి, వెంటనే పెట్టి ఆవేశంతో బాణంలాదూసుకుని ఇంట్లోకివచ్చింది. సౌదామిని పిచ్చిగా తలుపులన్నీ బారాతీసేస్తూ గదులన్నీ వెతక సాగింది.... ఎందుకో! ... ఏ గదిలో నేవా అమ్మ ఉండక పోతుందా అని ఆశ కాబోలు! ...

పెరటి తలుపు తీసింది... అప్పుడే వస్తూన్న లేత వెన్నెల చెట్ల ఆకులమీద పడి తళుక్కుమని మెరుస్తోంది, అరటిగెల మిగల మగ్గి ఉంది... సగం పళ్ళు నేలమీద రాలి నల్లగా కమిలిపోయి ఉన్నాయి జామిమ్మ పళ్లు చెట్టునపండి బద్దలై తనని చూసి ఎర్రగా నవ్వుకున్నాయి .. అమ్మ పూజ చేసుకుంటుండని రోజా ముద్ద మందార విరగ బూస్తోంది కాబోలు. వాడి ఎండి రాలిపోయిన మందార పువ్వులు, చెట్టు చుట్టూ గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. పెరటి చూరుకి పట్టిన తేనెపట్టు నుంచి కిందనున్న ఎండుటాకుల మీద చుక్క చుక్కలుగా తేనె పడుతూ చప్పుడు చేస్తోంది. ఆ చుక్కల కోసం ఆకులమీద నోరు తెరుచుకొని కూచున్న గండు చీమలకి మాత్రం ఆ చప్పుడేం పట్టినట్లు లేదు!...

పెరట్లోని ఆ దృశ్యం చూస్తే వృధాగా నేల పాలైన తన జీవితం గుర్తుకు వచ్చింది సౌదామినికి. వెంటనే పెరటి తలుపు విసురుగా వేసేసి పక్క గదిలోకి వచ్చింది. అది అమ్మ పూజా మందిరం. వ్యాస పీఠం మీద తెరిచిన భగవద్గీత తెరిచినట్టే ఉంది. రామపంచాయతనం చుట్టూ సాలీడు అల్లుకొని ఉంది. నూనె అయిపోయేట్టు ఉన్నంతవరకూ వెలిగి వెలిగి చివరికి ఆరిపోయినట్టున్నాయి. కుందెలలో నల్లగా బూడిదగా మారిన ఒత్తులు! అమ్మ విశ్చలంగా కూర్చుని చెదరని మనస్సుతో పూజ చేసుకొనే. పవిత్ర ప్రదేశం అది. ప్రశాంతతని ప్రసాదించే ఆచోట సౌదామినికి ఎంతో ఇబ్బందిగా తోచింది. అవును... తనలాటి చంచల బుద్ధి ఉన్న వాళ్ళకి అక్కడ చోటు లేదు. గుండె నిబ్బరం దూరదృష్టి ఉన్న అమ్మకి, వెట్టి ఆవేశంతో ఎది తోస్తే అది చేస్తూ ముందుచూపు లేకుండా బోర్లాపడే తనకి పోలికేమిటి? ఆ తల్లికి కూతురే తను?...

అన్నయ్య గదిలోకి అసలే కాలుపెట్టలేక పోయింది. సరస్వతీ నిలయంలాగ ఎప్పుడూ పుస్తకాలతో పవిత్ర గ్రంథాలతో కన్నుల పండువులా ఉండే అన్నయ్య గది ఇప్పుడు దుమ్ముతో దూగరతో గబ్బింపు కంపు కొడుతూ ఉంది...గదిలో ఏ వస్తువూ లేదు. అలమారు... పెట్టె... మంచం... అన్నీ శూన్యం!...... గదిమధ్య వో టేబిల్ మీద మాత్రం అన్నయ్య ఫోటో!... తనకి చిన్నప్పుడు గోరుముద్దలు తినిపించి ఎంతోగారాంగా చూసుకున్న అన్నయ్య... అలాంటి అన్నయ్యకి మారుగా తనకి నాళ మిగిలింది వాడి ఫోటోమాత్రమే. ఇంక "ఈ ఫోటో



హైదరాబాద్‌లో స్వర్గీయ బూర్గుల రామకృష్ణారావు స్మృతిచిహ్నంగా నిజాం కళాశాలవైపు కాకతీయ శిల్పంతో నిర్మించిన కాంగ్రెస్ మహాసభ ద్వారం

చూసుకొని బ్రతుకు" అంటూ వెళ్ళిపోయావా అన్నయ్యా! ఎక్కడికి వెళ్ళావు? ఏమీ చెప్పకుండా ఎవరికీ తెలియని చోటికి ఎక్కడికి వెళ్ళావు?...... అవునులే! సరిగా నేనూ ఇలాగే నీకు చెప్పకుండా వెళ్ళిపోయాను గా! నాకు కావలసిన శిక్షే ఇది! ... అప్పుడు నువ్వు ఎంతగా బాధపడ్డావో! ... ఏం చెయ్యను అన్నయ్యా?


అవును ... నేనేంచెయ్యను? మంచిచెడలు ఆలోచించే వయస్సు కాదది! ... రోజా నాతో పాటే తిరుగుతూ నన్నెదిపిస్తూ నా చేత మొటికాయలు తింటూన్న "రామూ" నాకు మొగుడేమిటి? ...వాడికిచ్చి పెళ్ళిచేస్తావంటుందేమిటి అమ్మ ... ఓ ఇంగ్లీషువాడు మాటువెయ్యడం చేతకాదు... సిగరెట్టు కాల్చడంకూడా తెలియదు... ఆఖరికి తనవిశాసించి అధికారం చెలాయించే మగవాడికైనా తీవి ఇసంతలేదు...

అవుగో, అవన్నీ కొత్తగా ఈ ఊరు దేవాలయం ఆఫీసరుగావచ్చి, ఎదురుగుండా ఉన్న గదిలో అద్దెకి ఉంటూన్న ఆ అందగాడిలో ఉన్నాయి... బి. కాం. చదివాడట! ... కవ్వించే కళ్లూ, నల్లగా నిగనిగా ఉంగరాలు తిరిగినజుట్టూ. అందమైననూటులో పచ్చగా కదిలే ఆ అబ్బాయికి "రామూ"కి పోలికా? ... ఎలాగేనా అతనితో మాట్లాడాలి... ఎలాగైనా అతని పరిచయం సంపాదించాలి... ఎలాగ? ... ఎలాగ? ... జీవితం తియ్యగా ఉండాలనీ బృందావనంలా తీర్చిదిద్దుకోవాలనే ఆకాంక్షతో ఇది మంచా చెడా అనే ఆలోచనేనా లేకుండా, ముందుగా "ఏమండీ! ...మీ చేతిలో ఉన్న పుస్తకం ఏమిటో ఓ మాటు ఇస్తారా! .. చదివి మళ్ళీ ఇస్తాను..." అని కబురు చేసింది తను ఈ వెంకి ద్వారానే! ... అతను ఎంత చిత్రంగా నవ్వి! ఆ పుస్తకం పంపించాడు! అట్ట తిప్పగానే తెలిసింది అతనిపేరు శేషు అని.

ఆ పుస్తకం ఎంత బాగుందని!... తనకెప్పుడూ అనుభవంలేని కొత్త లోకాల్లోకి తీసుకు వెళుతూ. కవ్విస్తూ... ఇలా ఎన్ని పుస్తకాలు. ఎన్ని పుస్తకాలు!... అన్నింటిలోనూ నాయకుడూ, నాయికా... శేషూ తనూలాగ ప్రేమించు

కోవడం. పెద్దవాళ్ళు వద్దనడం... ఎదిరించి పెళ్ళి చేసుకోవడం... లేదా చెప్పకుండా ఇద్దరూ వెళ్ళిపోవడం... అలా వెళ్ళి స్వర్గాలు సృష్టించుకోవడం!... తను కూడా అలా శేషుతో వెళ్ళిపోయి... అమ్మో, అన్నయ్యకి అమ్మకి చెప్పకుండానే...

అమ్మ పూజలో ఉండగా, అన్నయ్య పొలం వెళ్ళగా చూసి, కిటికీలోంచి తను శేషుకి ఎన్ని రాయబారాలు కళ్ళతో పంపించిందో.. అతనిచ్చిన నవలల్లో పెట్టి ఎన్ని ఉత్తరాలు అందించిందో... చివరకి ఆ రోజున శేషు తనని ఎలా ఒప్పించాడని!" రా...నాతో వచ్చెయ్యి... హాయిగా ఆదర్శంగా ఉందాం... ముందు మీ వాళ్ళకి చెప్పకు... తరువాత తెలిసి వాళ్ళే



కాంగ్రెస్ మహాసభల సింహద్వారం వద్ద అమర్చబడిన ఒక ఏనుగుల జంటను కళాకారులు తీర్చి దిద్దుతున్నారు

సర్దుకుంటారు... ఇంకకు... నువ్వు చదివిన నవలల్లో అమ్మాయిలు ఏం జేశారో, ఎలా చేశారో జ్ఞాపకం తెచ్చుకో!... ఊ... ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకో..."

మంత్రగాడి మాటలు విని అతను చెప్పినట్లల్లా చేసినట్టు, ఆ సాయంత్రం అతనితో బయలుదేరి పల్లె వదిలి, కాలిబాట నడిచి, పెద్ద రోడ్డు ఎక్కి, ఆ విద్ర గన్నేరు చెట్టు నీడలో బస్సు ఎక్కి పట్నం వెళ్ళిపోయింది తను. అలా వెళుతూండగా అమ్మా అన్నయ్యా జ్ఞాపకం వచ్చి ఎంత ఏడుపు వచ్చిందో తనకి మళ్ళీ రామూ జ్ఞాపకం వచ్చి అంత నవ్వు వచ్చింది... రామూ లాంటి అమాయక గబ్బిలాయితో కాకుండా శేషూ లాంటి నాగరికుడైన యువకుడితో తనకి వివాహం జరిగించబోతూన్న దేవుడికి ఎన్నిమార్లు కృతజ్ఞత అర్పించుకుందో! కాని రోజులు గడిచి, శేషు తనని పెళ్ళిచేసుకోబోడని తెలిసి, క్రమంగా పెరుగుతూన్న అతని అదలింపులూ, కేకలూ విని, అసలు సంగతిని అర్థం చేసుకొనే టప్పటికి, తను ఎంత చలించిపోయిందో! ఎంతగా కుమిలిపోయింది!

అలా తను శేషువల్ల నరకం అనుభవించింది ఎన్నాళ్ళని?...ఒకరోజా రెండు రోజులా?... అయిదేళ్లు ఈ అయిదేళ్ళనుంచీ. ఎప్పటికైనా శేషులో మార్పు రాకుండా ఉంటుందా తనని పెళ్ళిచేసుకోకుండా ఉంటాడా?... అంటూ ఆశతో ఎదురుచూస్తూంటే చివరికి తన ఆశ అడియాశ చేసి ఓరోజున చెప్పకుండా వెళ్ళిపోయాడు!... ముక్కూ మొహం తెలియని ఆ పట్నంలో దిక్కుమాలిన అనాథగా మిగిలిపోయిన ఆ రాత్రి... తలుచుకుంటే ఆరాత్రి... అమ్మో!...... గజగజా వణికిపోయింది గట్టిగా అరిచేసింది సౌదామిని!...

అది విని వెంకి విత్తరబోయి అమట్టునే కొంచెంసేపు ఉండిపోయి, ఆ తర్వాత లాంతరు అక్కడే ఉంచేసి "ఇప్పుడే వస్తా" అంటూ వెళ్ళిపోయింది. తడబడుతూన్న కాళ్ళతో కంగారుగా... మసిబారిన గాజుపలకల్లోంచి ఎర్రగా నల్లగా మసక మసకగా కనిపిస్తూన్న దీపాన్ని చూస్తూ, తన జీవితాన్ని గుర్తుచేసుకుంటూ, మోకాళ్ళమీద గడ్డం ఆన్చుకొని కూర్చున్న సౌదామిని, గేటు తీసుకొని ఎవరో నిదానంగా లోపలికి వస్తూఉండడం చూసింది. ఆ వ్యక్తి దగ్గరగా వచ్చాక రామూ అని గ్రహించి దిగ్గున లేచింది..." దీపం కనిపిస్తోంది... ఎవరన్నా వచ్చింది" అంటూ రామూ దగ్గరగా వచ్చి పరిశీలనగా చూసి, వెంటనే "నువ్వా!...వచ్చావా!" అన్నాడు ఉద్వేగంగా.

సమాధానం ఏం చెప్పకుండా వచ్చే దుఃఖాన్ని పెదిమకీ పంటికీ మధ్యన బిగించి తలవంచేసింది సౌదామిని.

రామూ ఏదో చెప్పబోయి కూడా అంతలోనే ఆగిపోయాడు ఆమె స్థితిని చూసి. మౌనంగా ఒకరి బాధ ఇంకొకరు అర్థం చేసుకుంటూ ఉండిపోయారు. సౌదామిని కొంచెం సేపటికి కాని తలెత్తి అతనికేసి చూడలేకపోయింది. ఆ మసక చీకట్లో వివర్ణమైన రామూ ముఖం స్పష్టాస్పష్టంగా కనిపించింది. కంగారుగా "రామూ!... నా కోసం బాధ పడుతున్నావా!" అంది సౌదామిని.

వెంటనే ముఖాన్ని సాధ్యమైనంత సౌమ్యంగా మార్చుకుంటూ "అబ్బే... లేదు... లేదు..." అన్నాడు తడబడుతూ.

రామూ అన్న ఆ మాటలు విని, నిస్తేజురాలై పోయింది సౌదామిని. నూనె అయిపోయిందో, గాలి తాకిడే తగిలిందో కాని దీపం రెపరెప లాడుతూ కొట్టుకోసాగింది.

సౌదామినికి దుఃఖం కటలు తెంచుకుంటూ వచ్చింది. రెండు గుప్పిళ్ళతోనూ నోరు మూసుకుంటూ "అవును లే! నువ్వు రామూవి... నువ్వెందుకు బాధ పడతావు!... అయినా ఈ నిర్భాగ్యురాలి కోసం బాధపడడం కూడా అనవసరం, అయిదేళ్ళ క్రితం వసంతంలో వెళ్ళిపోయినదాన్ని తిరిగి ఈ హేమంతంలో వచ్చాను మళ్ళీ వసంతం కోసం ఆశిస్తూ. పోగొట్టుకొన్న వసంతం తిరిగి లభిస్తుందా!... ప్చ్" ఈ మాట లంటూంటే ఆమె కంఠం వణికింది.

ఆమె మాటలు అర్థంకాక రామూ అలాగే నిలబడి చూస్తూ ఉండిపోయాడు.

"నీకర్థంకాదు రామూ!... నీకు అర్థంకాదు నువ్వు దేవుడివి. అందుకే నిన్ను అందుకోలేకపోయాను" అంటూన్న సౌదామిని కళ్ళల్లోంచి రెండు మంచుబిందువులు రాలి రామూ కాళ్ళమీద పడ్డాయి.

ఆ మంచు బిందువులు తమ మధ్య కొత్తచిగుళ్ళని చిగురింపజేస్తాయని ఆమెకి ఆశ లేదు.

అందుకే సౌదామిని నిర్జీవంగా నిలబడి ఉండిపోయింది.

ఏమీ అర్థంకాక రామూ శూన్యంగా చూస్తూ ఉండిపోయాడు.

వాళ్ళిద్దరి మధ్యనా అప్పటిదాకా ఉన్న ఆ కాస్త గుడ్డివెలుతురూ కూడా [illegible] మసిబారి. దీపం కొడిగట్టినకొద్దీ క్రమక్రమంగా చీకటిగా మారిపోసాగింది. ○